RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



2లో

కన్నడ నాట.. ఆరెస్సెస్ కార్యకలాపాలపై నిషేధం?



2లో

హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: కిషన్‌రెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :23 | సోమవారం 13 అక్టోబర్ 2025 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in



# ‘ఎస్సారెస్పీ రెండోదశ’కు దామోదర్‌రెడ్డి పేరు


## ప్రకటించిన సి ఎం రేవంత్ రెడ్డి

**సూర్యాపేట, అక్టోబర్ 12, మనసాక్షి**

మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, నాయకులు వి హనుమంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేలు, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎంపీ లు కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీరారెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తుంగతుర్తి సూర్యాపేట ప్రాంతానికి దామోదర్ రెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని అన్నారు. కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండాను ఎగరవేసిన గొప్ప నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డని సీఎం తెలిపారు. రాజకీయాల్లో ఈ రోజున ప్రతి ఒక్కరు ఆస్తులు సంపాదించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని కానీ రాంరెడ్డి దామోదర్ మాత్రం మనకు తండ్రినుండి వచ్చిన ఆస్తుల్ని పేదలకు పంచారని తన అత్తగారి కుటుంబం ఆస్తులు కూడా వేలాది ఎకరాలను ఇక్కడ తుంగతుర్తి ప్రజలకు దానం చేశారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాం రెడ్డి దామోదర్ రెడ్డికి సంతాపం తెలియజేయవలసిందిగా రాహుల్ గాంధీ సోనియాగాంధీ మల్లికార్జున ఖర్గ లు తెలిపారని,వారి తరఫున సర్వోత్తమ్ రెడ్డికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని

అన్నారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి ఏఐసిసి అన్ని విధాల అండగా ఉంటుందని, గాంధీ కుటుంబం దామోదర్ రెడ్డి కుటుంబానికి సహాయం చేస్తుందని అన్నారు. ఎస్సారెస్పీ నీళ్ల కరువు ప్రాంతమైన తుంగతుర్తి కి తీసుకుని రావడంలో కీలకపాత్ర పోషించి ఈ కరువు ప్రాంతమైన ఫ్లోరైడ్ ప్రాంతమైన తుంగతుర్తిలో గోదావరి జలాలు తీసుకురావడానికి పాటుపడి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ను ఒప్పించి నీళ్లు తీసుకొని వచ్చిన రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరును ఎస్ ఆర్ ఎస్ పి స్టేజ్ 2 కాలువకు పెడుతున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.







2లో

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం

- హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉన్నత న్యాయస్థానం తీర్పు క్షుణ్ణంగా పరిశీలన
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, న్యాయ నిపుణుల విస్తృత చర్చలు
- రేపు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయం

**రిజర్వేషన్లపై కసరత్తు, బిల్లుల పెండింగ్ సహా అన్ని విషయాలు వివరించాలన్న సీఎం త్వరలో జరిగే కేబినెట్ భేటీ ఎజెండాలో బీసీ రిజర్వేషన్లు సుప్రీంలో ఎలాంటి తీర్పు వస్తే ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించే చాన్స్**



2లో

# 42% రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ

- ఏకతాటిపైకి ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్
- మరింత బలంగా ఉద్యమిస్తామని వెల్లడి
- 13న ‘దిగ్బంధం’ రద్దు..
- 14 నాటి బంద్ 18కి వాయిదా

బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ సాధించే దాకా జేఏసీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ హెూటల్‌లో సమావేశమైన బీసీ నేతలు..



2లో

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

- జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ
- రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా

బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. “ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో ‘మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు’ అని ఆయనే స్వయంగా చెప్పారు” అని కేటీఆర్ గుర్తుచేశారు.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలు...

**ఎన్డీయే కూటమి సీట్ల పంపకం ఖరారు...**

**ఎవరికి ఎన్ని సీట్లంటే...!**

- బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్డీయేలో కొలిక్కివచ్చిన సీట్ల పంపకం
- బీజేపీ, జేడీయూలకు సమానంగా చెరో 101 స్థానాలు
- చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 29 అసెంబ్లీ సీట్ల కేటాయింపు
- మాంఝీ, కుష్వాహా పార్టీలకు చెరో ఆరు స్థానాలు
- సామరస్యంగా ఒప్పందం కుదిరిందని నేతల ఉమ్మడి ప్రకటన
- నితీశ్ కుమార్ నేతృత్వంలోనే ఎన్నికల బరిలోకి ఎన్డీయే కూటమి





2లో

**మిగిలిన స్థానాలను ఇతర మిత్రపక్షాలకు కేటాయించారు. ఇందులో భాగంగా, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ-రామ్ విలాస్ (ఎల్‌జేపీ-ఆర్‌వీ)కు 29 సీట్లు దక్కాయి. అలాగే, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం), ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) పార్టీలకు చెరో ఆరు స్థానాలు కేటాయించినట్లు ఎన్డీయే నేతలు వెల్లడించారు.**

బీహార్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే)లో సీట్ల పంపకాలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కూటమిలోని ప్రధాన భాగస్వాములైన బీజేపీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్-యునైటెడ్ (జేడీయూ) చెరో 101 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 సీట్లు ఉన్నాయి.

# అమ్మాయిలు

## రాత్రివేళ బయటికి వెళ్లొద్దు



**పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం అమ్మాయిలు రాత్రి వేళల్లో బయట తిరగవద్దని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్య ఇలాంటి నేరాలపై తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టీకరణ అఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విషయంపై స్పందించిన జాతీయ మహిళా కమిషన్, నివేదికకు ఆదేశం**

కోల్‌కతా: విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, “బయటి రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. రాత్రిపూట ఎవరు ఎక్కడికి వెళుతున్నారో పోలీసులకు తెలియదు. ప్రతి ఇంటికీ వెళ్లి పోలీసులు కాపలా కాయలేరు కదా. రాత్రి 12:30 గంటలకు బయటకు వెళ్లినప్పుడు ఏదైనా జరిగితే...! మేము ఆ ఘటనను ఖండిస్తున్నాం. ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ అందరికీ ఉంది, కానీ జాగ్రత్తగా ఉండాలి” అని మమతా బెనర్జీ అన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి కూడా బాధ్యత ఉంటుందని ఆమె గుర్తుచేశారు.

**అసలేం జరిగింది?**

ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఓ యువతి దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి భోజనం కోసం కాలేజీ క్యాంపస్ బయటకు వెళ్లింది. ఆ సమయంలో బైక్‌లపై వచ్చిన కొందరు యువకులు వారిని వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించారు. విద్యార్థిని స్నేహితుడిని బెదిరించి పంపించివేసి, ఆమెను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మొబైల్ ఫోన్ కూడా లాక్కుని పడేశారు.కాసేపటి తర్వాత ఆ స్నేహితుడు మరికొందరితో కలిసి అక్కడికి చేరుకోగా, విద్యార్థిని గాయాలతో కిందపడి ఉండటాన్ని గమనించి ఆసుపత్రికి తరలించారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనకు సంబంధించి షేక్ రియాజుద్దీన్, అపు బౌరి, ఫిర్దోస్ షేక్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (NCW) కూడా స్పందించింది. ఐదు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని పశ్చిమ బెంగాల్ డీజీపీని ఆదేశించింది. విద్యార్థినికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మెడికల్ కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలకు సంబంధించిన జీవోలు 9, 41, 42లను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న ఈ అంశంపై సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయనుంది. హైకోర్టు తీర్పు దరిమిలా తదుపరి కార్యాచరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, న్యాయ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో చర్చించాక సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలుకే ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు అధికారవర్గాల సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కేలా చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి.

**అన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకే..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమశాఖ ఇచ్చిన జీవో నంబర్ 9తో పాటు దాని ఆధారంగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్ల ఖరారుపై పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవోలు 41, 42ల అమలుపై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ నెల 9 నుంచి అయిదు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) జారీ చేసిన నోటిఫికేషన్ కూడా రద్దయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే హైకోర్టు విధించిన స్టే ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాకే సుప్రీంను ఆశ్రయించాలనే నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

**16న కేబినెట్‌లో చర్చ..**

ఈ నెల 16వ తేదీన కేబినెట్ భేటీ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలు, ఏపీ చేపడుతున్న 'బనకచర్ల', ఆలమట్టి ఎత్తు పెంపు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లిన తర్వాత ఎలాంటి తీర్పు వెలువడితే ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ జీవోలు, స్థానిక ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ శాఖల మంత్రులు కూడా ఆయా అంశాలపై తమ అభిప్రాయాలను ఇప్పటికే వెల్లడించారు. మొత్తం 50 శాతం రిజర్వేషన్లతో ఈ ఎన్నికలు నిర్వహించుకోవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేక జీవో ద్వారా బీసీలకు అదనంగా కేటాయించిన 17 శాతం రిజర్వేషన్లను ఆన్ రిజర్వ్‌డ్ (జనరల్)గా పరిగణించి, పెంచిన రిజర్వేషన్లు సర్దుబాటు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో..బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించి చేసిన కసరత్తు, ఆ దిశలో కొన్ని నెలలుగా సాగించిన కృషిని తుదకంటా కొనసాగించాలనే నిశ్చితాభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్టు సమాచారం. తద్వారా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అంటున్నారు.

**సుప్రీంలో సమర్థ వాదనలు వినిపించాలి**

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వేషన్ల కోసం బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే, ఏకసభ్య కమిషన్ ఏర్పాటు, ఎంపిరికల్ డేటా విశ్లేషణ అనంతర నివేదికల ఆధారంగా శాసనసభలో బిల్లులు ఆమోదం, వాటిని గవర్నర్ ఆమోదం కోసం పంపించిన తీరును సుప్రీంకోర్టుకు సవివరంగా తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను, న్యాయ నిపుణులను కోరినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు, స్థానిక సంస్థల్లో 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుకు మొదట ఆర్డినెన్స్ ఆ తర్వాత బిల్లుల ఆమోదం వంటి కీలక అంశాలలో జరుగుతున్న జాప్యాన్ని కూడా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావాలని, రిజర్వేషన్లకు సంబంధించిన ట్రిపుల్ టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించిన విషయం వివరించాలని నిర్ణయించారు. అసెంబ్లీలో బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయన్న విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని భావిస్తున్నారు. రాష్ట్రపతి, గవర్నర్‌ల వద్ద 90 రోజుల పరిమితికి మించి బిల్లులు పెండింగ్‌లో ఉంటే అవి ఆమోదం పొందినట్టుగానే భావించాల్సి ఉంటుందని గతంలో సుప్రీంకోర్టు.. తమిళనాడు ప్రభుత్వం విషయంలో ఇచ్చిన ఉత్తర్వులను గురించి ప్రస్తావించనున్నట్టు తెలుస్తోంది. లక్షల మందికి పైగా ఉద్యోగులతో చేసిన సర్వే వివరాలను సుప్రీంకోర్టు ముందుంచాలని నిర్ణయించినట్లు సమాచారం.

# 42% రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ



ఖైరతాబాద్:రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అందకుండా చేస్తున్న కుట్రలను అడ్డుకునేందుకు తెలంగాణ బీసీ జేఏసీని ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షులుగా ఉన్న ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ సంయుక్తంగా ప్రకటించారు. బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ సాధించే దాకా జేఏసీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన బీసీ నేతలు.. జేఏసీగా ఏర్పడి ఉద్యమించాలని నిర్ణయించారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యనేతలు మాట్లాడారు. బీసీ సంఘాలతో చర్చించుకుని 42 శాతం రిజర్వేషన్ కోసం మరింత బలంగా ఉద్యమించే లక్ష్యంతో.. ఈ నెల 14న తలపెట్టిన బంద్‌ను 18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన జాతీయ రహదారుల దిగ్బంధాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 'బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వటం అన్యాయం. రిజర్వేషన్లకు మద్దతుగా వాదించేందుకు 30 మంది బీసీలు పిటిషన్లు వేసినా వాటిని వినకుండా ఏకపక్షంగా స్టే ఇచ్చారు. ఈ నెల 18న చేపట్టే బంద్‌ను విజయవంతం చేసేందుకు బీసీ కుల, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు జేఏసీలుగా ఏర్పడాల'ని పిలుపునిచ్చారు. జాజుల మాట్లాడుతూ 'ఈ రోజే బీసీల అసలైన యుద్ధం మొదలైంది. మా మధ్య వైరుధ్యాలేమీ లేవు. ఉన్నవి భిన్నాభిప్రాయాలు మాత్రమే. బీసీల ప్రయోజనాల కోసం వాటిని పక్కన పెట్టి ఏకమయ్యాం. కుట్రలను ఛేదించి 42 శాతం రిజర్వేషన్లను రక్షించుకునేందుకు పార్టీలు, సంఘాలకు అతీతంగా ఒకే వేదికపైకి వచ్చాం. బంద్‌కు అన్ని వర్గాల

మద్దతు కోరతాం' అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీఆర్ నారగోని బీసీ జేఏసీ కార్యవర్గాన్ని ప్రకటించారు. జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్‌గా వీజీఆర్ నారగోని, కార్యనిర్వాహక ఛైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో ఛైర్మన్లుగా రాజారాం యాదవ్, దాసు సురేశ్, కో ఆర్డినేటర్‌గా గుజ్జ కృష్ణ ఉంటారని, ప్రతి సంఘం, కులం నుంచి జేఏసీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు.

# విశాఖకు పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి... నగరం రూపురేఖలు మార్చాలి: మంత్రి నారా లోకేశ్

**ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక సమీక్ష**

**విశాఖ రీజియన్‌కు భారీగా పెట్టుబడులు రాబోతున్నాయని వెల్లడి**

**5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు**



విశాఖపట్నం :రీజియన్ భారీ ఎత్తున పెట్టుబడులకు కేంద్రంగా మారనుందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, రాబోయే 30 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని ఒక పటిష్టమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి కీలక అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "విశాఖ ప్రాంతానికి పెద్ద ఎత్తున కంపెనీలు, పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరం యొక్క రూపురేఖలు మార్చేలా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలి. బెంగళూరు, పుణె వంటి నగరాలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు భవిష్యత్తులో విశాఖలో తలెత్తకుండా ముందుచూపుతో వ్యవహరించాలి. దీనికోసం విశాలమైన రహదారుల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయాలి" అని సూచించారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులను చేపడుతోందని, రాబోయే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌తో పాటు ఇతర కంపెనీల ఏర్పాటు ద్వారా సుమారు 5 లక్షల ఉద్యోగాలు స్థానిక యువతకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మేధోపరమైన చర్చల ద్వారా నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారి ఆమోదంతో 'మిషన్ మోడ్'లో జరగాలని స్పష్టం చేశారు. నగరంలో

కొత్త ఐటీ పార్కుల ఏర్పాటుకు అనువైన ల్యాండ్ బ్యాంకులను వెంటనే గుర్తించి, సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, శాసనసభ విప్ గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, వీఎంఆర్‌డీఏ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**30 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశాలు**

**ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని సూచన**

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

**హామీలన్నీ మోసమే...!**

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు.

**బీజేపీపైనా విమర్శలు**

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలు...

పాట్నా, ఢిల్లీలలో సుదీర్ఘ చర్చల అనంతరం కుదిరిన ఈ ఒప్పందం వివరాలను ఎన్డీయే అగ్రనేతలు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఉమ్మడిగా ప్రకటించారు. బీహార్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. ఎంతో సామరస్య వాతావరణంలో సీట్ల పంపకాలు పూర్తయ్యాయని, కూటమి ఐక్యంగా ఎన్నికల బరిలోకి దిగుతోందని వారు తెలిపారు.ఈ ఒప్పందంపై మిత్రపక్షాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. "లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఒక సీటు ఇచ్చారు, ఇప్పుడు ఆరు సీట్లు కేటాయించడం సంతోషంగా ఉంది" అని జితన్ రామ్ మాంఝీ అన్నారు. మరోవైపు, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు స్థానాల్లోనూ గెలిచి సత్తా చాటిన చిరాగ్ పాశ్వాన్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 29 సీట్లు దక్కడం గమనార్హం. ఈ సీట్ల పంపకాలతో ఎన్డీయే కుటుంబం ఐక్యంగా ఉందని, నితీశ్ కుమార్ నేతృత్వంలో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చిరాగ్ పాశ్వాన్ ధీమా వ్యక్తం చేశారు.సీట్ల సర్దుబాటు పూర్తి కావడంతో, నితీశ్ కుమార్ నాయకత్వంలో బీహార్‌లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి సమష్టిగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది.

# హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. "కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో ఏం చేయగలడు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయలేరు. మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయలేకపోయాం. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ.. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టులో.. రిజర్వేషన్లకు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం క్యాప్‌నకు వ్యతిరేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది. ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం భాజపా పూర్తి మద్దతు ఉంటుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం 3 పేర్లను జాతీయ పార్టీకి పంపించాం. పార్లమెంటరీ బోర్డు మీటింగ్ తర్వాత అభ్యర్థి ప్రకటన ఉటుంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కన్నడ నాట.. ఆరెస్సెస్ కార్యకలాపాలపై నిషేధం? రాష్ట్ర ప్రభుత్వ యోచన!



బెంగళూరు(యశ్వంతపుర) రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కార్యకలాపాలను నిషేధించాలంటూ ఓ మంత్రి రాసిన లేఖ కర్ణాటకలో కలకలం రేపింది. ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ... ఈ నెల 4న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే లేఖ రాశారు. లేఖను పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించినట్లు తెలియవచ్చింది. లేఖ ఉదంతం ఆదివారం వెలుగులోకి రావడంతో రాష్ట్రంలో రాజకీయ దుమారం లేచింది. ప్రభుత్వ మైదానాలు, ఉద్యానవనాలు, పాఠశాలల ఆవరణలు, క్రీడా మందిరాలు తదితరాల్లో ఆరెస్సెస్ శాఖలు.. బైఠక్, సాంఘిక్ పేరిట కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతించకూడదని, వాటిని నిషేధించాలని లేఖలో ప్రియాంక్ ఖర్గే కోరారు. ప్రజల ఆలోచనల్లో విషబీజాలను నాటే శక్తులను నియంత్రించకపోతే లౌకికవాదంతో పాటు రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతుందన్నారు.'ప్రభుత్వ ఆర్థికసాయంతో నడిచే పాఠశాలలు, కళాశాలల మైదానాలు, ప్రభుత్వ స్థలాల్లో తమ కార్యక్రమాలు నిర్వహిస్తూ... లౌకికవాదం, భారతీయ ఏకతకు వ్యతిరేకంగా నినాదాలు ఇస్తున్నారు. రాజ్యాంగ ఆశయాలకు వ్యతిరేకంగా విషభావాలను నింపుతున్నారు' అని ఆయన ఆరోపించారు. పోలీసుల అనుమతి లేకుండా పెద్ద కర్రలు చేతబట్టి సాములు చేస్తూ, ప్రదర్శనలిస్తూ బాలలు, యువతీయువకుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆర్థికసాయంతో నడిచే విద్యాసంస్థలు, ఉద్యానవనాలు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవస్థానాల ఆవరణల్లో... ఆరెస్సెస్ నిర్వహించే బైఠక్, సాంఘిక్ తదితర కార్యక్రమాలపై నిషేధం విధించాలని ఆయన లేఖలో విన్నవించారు. ప్రియాంక్ ఖర్గే లేఖకు పలువురు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతలు మద్దతు పలికారు.ధైర్యం ఉందా ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నాయా? అని భాజపా నేతలు సవాల్ విసిరారు. అంత ధైర్యముంటే నిషేధించాలని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. 'ఇందిరాగాంధీ వల్లే కాలేదు... మీ వల్ల ఏమవుతుంది?' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర నిలదీశారు. ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించడం ఎవరితరమూ కాదని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టీకరించారు.

# నిర్దేశిత వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, అక్టోబర్ 12,మన సాక్షి:**



నిర్దేశిత వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్ ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా. సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్లవేళలా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లను అడ్డుకోవడం సిగ్గుచేటు

**నాచారం, అక్టోబర్ 12,మన సాక్షి:**



బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న అగ్రవర్ణ కుట్రపూరిత ధోరణికి వ్యతిరేకంగా బీసీ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రవర్ణాలు వారి జనాభాకి మించి, వారి పేదరికానికి మించి 10 శాతం రిజర్వేషన్లను అనుభవిస్తూ అత్యంత వెనకబడిన బిసి ల రిజర్వేషన్లను అడ్డుకోవాలనుకోవడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. బిసిల హక్కులను, రిజర్వేషన్లను దక్కకుండా చేయాలని కుట్రలు చేస్తే దేశవ్యాప్త పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్ల పై కేసులు వేసి అడ్డుకోవాలని చుస్తే బహుజన సమాజం దృష్టిలో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్, బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు, తాళ్ల అజయ్, జార్జ్ రెడ్డి పి డి ఎస్ యు నాయకులు సుమంత్, టిడిఎస్ఎఫ్ విజయ్ నాయక్, గౌతమ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు

## బీసీలపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు

**నారాయణపేట టౌన్,అక్టోబర్ 12, మన సాక్షి :**

వెనుకబడిన తరగతుల వారికి విద్యా,ఉద్యోగాలు,రాజకీయ రిజర్వేషన్లు 42 శాతం కల్పిస్తామని అది చట్టరూపం దాల్చకుండ బిసి లను కాంగ్రెస్ ప్రభుత్వం బలికా బకరా చేస్తున్నదని నారాయణపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసిల కు 42శాతం రిజర్వేషన్లు కోర్టు కొట్టి వేయడంతో కాంగ్రెస్ అసలు రంగు బయట పడిందని అన్నారు. ఆపార్టీకి మోసం చేయడమే అలవాటు తప్పా చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మత పరమైన ఓటు రాజకీయాలు చేస్తూ మతాల మధ్య చిచ్చు పెట్టిందని ఇప్పుడు బిసి రిజర్వేషన్ల ముసుగులో కులాల మధ్య చిచ్చు పెడుతు న్నదని విమర్శించారు.కానీ బీసిల పై కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం ప్రేమ చిత్తశుద్ధి లేదని అన్నారు.కపట ప్రేమ వలకబోస్తు 42శాతం బిసి రిజర్వేషన్ల పేరుతో బిసిలను మోసం చేసిందని అన్నారు. బిసి రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ కి ఎలాంటి చిత్తశుద్ధి లేదని జి ఓ 9 నీ కోర్టు కొట్టి వేయడంతో మరోసారి మోసం బయటపడిందని అన్నారు.

## సహచరుడి కూతురి పెళ్ళికి మిత్రుల ఆర్థిక సహాయం



**గోదావరిఖని,అక్టోబర్ 12,మన సాక్షి:**

తమతో 35 సంవత్సరాల పాటు పనిచేసి మృతి చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు జహీద్ కుమార్తె వివాహం సందర్భంగా ఓసీపీ-1 డ్రాగ్ లైన్ ఉద్యోగులు మానవతను చాటుకున్నారు. రూ.65,500ను సమకూర్చి తమ ప్రతినిధులు మాజీ డీజీఎం కొత్త కిషన్, ఆపరేటర్ చంద్రపాల్ చేతుల మీదుగా ఆదివారం గోదావరిఖని అశోక్ నగర్ లోని జహీద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలిసి పనిచేసిన సహచరుడి కుటుంబం పట్ల బాధ్యతగా భావించి అందరం సమిష్టిగా ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సహకరించిన డ్రాగ్ లైన్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డ్రాగ్ లైన్ ఆపరేటర్ రామ్మోహన్, జహీద్ కుటుంబ సభ్యులు ఇజాజ్ అమేనా,ఖయ్యుమ్,జెబా తబస్సుమ్ ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**వెల్దండ,అక్టోబర్ 12,మన సాక్షి:**

వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక మనిషా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. వారి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 24 వేల రూపాయల చెక్కు ను కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, జంగయ్య గౌడ్, విజేందర్,బాలయ్య,రాములు, కృష్ణ, కే. బాలయ్య, తిరుపతి నాయక్, సుధాకర్, కొండల్, శివధనుసు, ఎండి అజార్, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఆర్మూర్,అక్టోబర్ 12,మన సాక్షి:**

ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కాలం తీరినప్పటికీ,విద్యార్థి దశ జ్ఞాపకాలు మాత్రం సజీవంగా నిలిచి ఉన్నాయని పాల్గొన్న వారు భావోద్వేగంగా పేర్కొన్నారు. పట్టణంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసుకోవడం అందరికీ ఆనందాన్ని కలిగించింది. పాఠశాల రోజులలో కలసి గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పరస్పరం ఆప్యాయత స్థాయిని పంచుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు "గాజుల సవ్వడి" అనే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో పూర్వ విద్యార్థులు తమ కళాప్రతిభను ప్రదర్శించి, వాతావరణాన్ని ఉత్సాహంతో నింపారు. కార్యక్రమంలో జయలక్ష్మి, లావణ్య, స్వాతి, శిల్ప,శ్రావణి,లక్ష్మి, ప్రియాంక,సునీత,భాను తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ గడ్డం వంశీ చిత్రపటానికి పాలభిషేకం

**గోదావరిఖని అక్టోబర్ 12,మన సాక్షి:**



రామగుండంలో ఎయిర్పోర్ట్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడా న్ని హర్షిస్తూ పెద్దపెల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణసంచాలతో సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రూ:40.53 లక్షలు మంజూరు చేసి, ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కు ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించిందని రామగుండం ఎయిర్పోర్ట్ స్థాపన దిశగా చారిత్రాత్మక ముందడుగని నాయకులు తెలిపారు. ఎయిర్పోర్టు రావడానికి కృషి చేసిన పెద్ద పల్లి ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రఫీక్, వాసర్ల సురేందర్, హకీమ్, తిపర్తు మధు, నరేందర్ రెడ్డి,జవీద్,చారి, కిషోర్,మధు,మహేష్,శ్రీను, విజయ్, శేఖర్, తదితీరులు పాల్గొన్నారు.

## 14న బంద్ విజయవంతం చేయాలి

**నారాయణపేట టౌన్, అక్టోబర్ 12, మన సాక్షి :**



కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించి, పార్లమెంటు సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టకుండా అసెంబ్లీ సమావేశాలలో జీవో 9ను తీసుకోవచ్చిందని ఇట్టి జీవోను హైకోర్టు కొట్టి వేసిందని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్ ల సాధన కోసం బీసీ దళపతి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు ఈ నెల 14న నారాయణ పేట్ బందుకు పిలుపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ని కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని వాపోయారు. రాజకీయాలకతీతంగా, బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తమ సత్తా చాటాలని, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని కోరారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు

**నారాయణపేట టౌన్, అక్టోబర్ 12, మన సాక్షి :**



జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆదివారం ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను, అనుమానిత వ్యక్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో పోలీసులు సంతోష్, రవి కుమార్ లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. ప్రజలు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు కనబడిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12,మన సాక్షి:**

పిల్లలకు పోలియో సోకకుండా వారి నిండు జీవితానికి రక్షణగా తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు.శేరిలింగంపల్లి డివిజన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, లింగంపల్లి విలేజ్ బస్తీ దావఖానాలో స్థానికంగా నివసిస్తున్న పేద ప్రజల పిల్లలకు డి ఏం హెచ్ ఓ డాక్టర్ లలితా దేవి తో కలిసి పోలియో టీకాను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ వేశారు.ఈ సందర్భంగా నూతనంగా రంగారెడ్డి జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టిన లలితాదేవి ని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పల్స్ చుక్కలు వేయించేల చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్, డాక్టర్ ఉమా దీపిక, డాక్టర్ మొహమ్మద్ ఆవేజ్, హీన, డాక్టర్ సమీన, డాక్టర్ జ్యోత్స్న, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, నర్సింహా, సైదులు యాదవ్, మహేష్, సాయి, రాకేష్, శరణ్, ముంతాజ్ బేగం, సరోజిని శ్యామల హాస్పిటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కల్ సేవా సమితి 6వ వార్షికోత్సవం

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**




మియాపూర్ డివిజన్ ప్రగతి ఎన్క్లేవ్ పార్కులో ఒరిస్సా ప్రాంతానికి చెందిన వీరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్కల్ సేవా సమితి 6 వార్షికోత్సవ కార్యక్రమానికి రవికుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవా సమితి వార్షికోత్సవానికి తనను ఆహ్వానించినందుకు కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ మీరు చేస్తున్నటువంటి అనేక సేవా కార్యక్రమాలు అభినందించదగ్గవని అన్నారు.శేరిలింగంపల్లి ప్రాంతంలో ఒరిస్సా ప్రాంతం నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి అనేక వృత్తులు చేస్తూ జీవనోపాదం పొందుతున్న వారికీ భారతీయ జనతా పార్టీ తరపున ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సహాయ , సహకారాలు కమిటీ సభ్యులకు ఉంటుందని, రేపు రాబోయే రోజుల్లో తమ మద్దతు కూడా భారతీయ జనతా పార్టీకి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నాగుల గౌడ్, మాణిక్ రావు,రాధాకృష్ణ యాదవ్ మహేష్ యాదవ్, లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్, గోపి,వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాండిచ్చేరి మాజీ సిఎంని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**వెల్దండ, అక్టోబర్ 12,మన సాక్షి:**



నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి నూతన అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామిని వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి.విజయ్ కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, తక్కళ్ళపల్లి. శేఖర్,కడారి శ్రీనివాస్, పాండు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ చొరవతో రోడ్డు పై గుంతలు పూడ్చివేత


**వెల్దండ ,అక్టోబర్ 12,మన సాక్షి:**



వెల్దండ మండల సమీపంలోని కొట్ర గేట్ చౌరస్తాలో తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కొరకై జిల్లా ఎస్పీ గైక్వాడ్ ఆదేశాల మేరకు ఆదివారం వెల్దండ ఎస్సై కురుమూర్తి ప్రత్యేక చొరవ తీసుకొని గుంతలు పడిన ప్రదేశం పై కాంక్రీట్ తో గుంతలను పూడ్చివేయడం జరిగిందని ఎస్సై కురుమూర్తి తెలియజేశారు. కొట్ర గ్రామస్తులు, పలువురు వాహనదారులు ఎస్సై ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, కానిస్టేబుల్ శ్రీను,రఘు, పర్వతాలు, కృష్ణయ్య పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో వ్యక్తి అదృశ్యం

**శంకర్‌పల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



ఓ వ్యక్తి అదృశ్యం ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల మాందాపూర్ గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశం (48) అక్టోబర్ 1న ఇంట్లో నుండి పారిపోయి శంకర్‌పల్లి మార్కెట్ కి వచ్చాడు. పుట్టుకతోనే ఇతనికి మాటలు రావు, చెవులు వినపడవు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్ లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు: ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాంధీ పాల్గొని ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజలు పల్స్ పోలియో కార్యక్రమంలో విజయవంతం చేయాలన్నారు. నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడండి. 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. 2 చుక్కలు పోలియో మందు వేయించి మీ పిల్లల బంగారు భవిష్యత్తు కు బాటలు వేసి పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, నాయకులు కావూరి అనిల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పథ సంచలన్ కార్యక్రమం



**గోదావరిఖని అక్టోబర్ 12,మన సాక్షి:**

ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోదావరిఖని పట్టణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్దకు చేరుకున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశ ఆత్మను ప్రతిబింబించే సంస్థ అని తెలిపారు సేవ, శిస్తు, దేశభక్తి, సాంస్కృతిక గౌరవం అనే విలువలను ప్రతి భారతీయుడిలో నాటే శక్తిగా ఆర్ఎస్ఎస్ నిలిచిందని పేర్కొన్నారు. సమాజ సేవ ద్వారా దేశ నిర్మాణం అనేది సంఘం లక్ష్యం అన్నారు. పథ సంచలన్ ద్వారా క్రమశిక్షణ, ఏకతా, దేశప్రేమను ప్రజల్లో చాటడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని,దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందన్నారు.

## పోలియో చుక్కలు వేయించాలి

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



నిండైన జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి లోని బస్తి దావఖాన లో నిర్వహించిన "పల్స్ పోలియో" కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి ఐదేళ్లు లోపు పిల్లలందరికీ నిండైన జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో తల్లిదండ్రులు విధిగా వేయించాలన్నారు. మీరు వేయించే రెండు చుక్కలు మీ పిల్లల పోలియో రహిత నిండు జీవితానికి అండగా ఉంటుందని అన్నారు. పిల్లలకు పోలియో చుక్కలతో అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు అని తెలిపారు. పోలియో రహిత సమాజమే లక్ష్యంగా నేడు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు హనుమంత్ నాయక్ సీనియర్ నాయకులు సుమన్,రంగస్వామి ముదిరాజ్, అంగన్వాడీ టీచర్ రాధిక ,నర్సింగ్ ఆఫీసర్ వేరోనికా, ఆశ వర్కర్ లత ,అంగన్వాడీ హెల్పర్ సుజాత , సపోర్టింగ్ స్టాఫ్ సుధ వైద్యసిబ్బంది, స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ లో జరిగిన గ్యార్వి షరీఫ్ ముబారక్ ఉత్సవంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవమని, అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక అని అన్నారు. ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం గ్యార్వి ఉత్సవం అన్ని హంగులతో అంగరంగ వైభవంగా జాతర వాతావరణం ఉట్టి పడేలా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే గ్యార్వి షరీఫ్ పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎల్లవేళలా మీ వెన్నంటే ఉండి అన్ని రకాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గఫర్, సీనియర్ నాయకులు యాదా గౌడ్, రామ్ మోహన్ రెడ్డి, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, సలవడీసీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కాదర్ ఖాన్, తాహెర్, అజీజ్, షాదిక్, మహబూబ్, అలీం, ఖలీల్, అలీ, రజాక్, మీర్ అలీ, నర్సింహా,సైదులు, సత్యనారాయణ, దస్తగిరి, జగదీశ్, నాందేవ్, ముస్లిం సోదరులు స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

**ఆర్మూర్,అక్టోబర్ 12,మన సాక్షి:**



ఆలూర్ మండలం మిర్దపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం మిర్దపల్లిలోని ఆంజనేయులు రేకుల షెడ్డు లో గల పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ఆరుగురు వ్యక్తులు మూడు ముక్కల పేకాట ఆడుతుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారివద్ద నుండి రూ.48,500 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక కారు మరియు ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్హెచ్ఓ సత్యనారాయణ తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు



**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**

అమనగల్లు పట్టణ కేంద్రంలో ఆదివారము గ్యార్మీ వేడుకలను ముస్లిం మైనారిటీలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా మౌలాలి పహాడ్ దర్గా సమీపంలోని గౌసే పాక్ ఛీల్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లింల మత గురువు హజ్రత్ సయ్యద్ జహిర్దిన్ షా ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లిం మైనారిటీ లతో కలిసి గ్యార్మీ షరీఫ్ జెండాతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గౌసేపాక్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువా కార్యక్రమాలు నిర్వహించారు. మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో అతని నివాసంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతని గెలిపించాలి

**మేడ్చల్,అక్టోబర్ 12,మన సాక్షి:**



మాగంటి సునీత గోపీనాథ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతని ఆదివారం శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తన నియోజకవర్గ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్, మేకల సునీత రాము యాదవ్, నాయకులు తన బృందంతో మర్యాదపూర్వకంగా కలిశారు. మాగంటి సునీత గోపినాథ ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ విజయం కోసం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై నాయకులతో కలిసి వారు చర్చించారు.

# పిల్లల భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలు తప్పనిసరి

**ఆమనగల్లు,అక్టోబర్ 12, మన సాక్షి:**



దేశంలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించబడిందని కడ్తాల్ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి అన్నారు.

ఆదివారము మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు వ్యాక్సినేషన్ సెంటర్లను సందర్శించి గాంధీజీ విగ్రహ కూడలిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ సెంటర్ లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ స్థానిక నేతలతో పాల్గొని 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తల్లి దండ్రులు తమ పిల్లలను వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్లి పోలియో డ్రాప్స్ వేయించడం ద్వారా దేశాన్ని పోలియో రహిత భారతంగా నిలబెట్టడంలో భాగస్వాములు అవుతారని తెలిపారు. పోలియో పూర్తిగా నిర్మూలించబడిన దేశంగా రూపుదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. పిల్లల భవిష్యత్తుకు పోలియో చుక్కలు తప్పనిసరి అని అంగన్వాడీ మరియు ఆశా వర్కర్ల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో జల్కం నాగార్జున, రాయికంటి సురేష్,అహ్మద్, అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ, యాదమ్మ ఆశా వర్కర్లు సబిత, లు పాల్గొన్నారు.

## 14న జరిగే రాష్ట్ర బంద్ కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**వెల్దండ ,అక్టోబర్ 12 ,మన సాక్షి:**



కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు హామీలో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించింది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకుండానే కేవలం అసెంబ్లీలోనే ప్రవేశపెట్టి జీవో నెంబర్ 41, 42, 43, మరియు జీవో 9 ను తీసుకువచ్చి ఎలక్షన్ షెడ్యూల్ ను ప్రకటించడం జరిగింది. ఇది రాజ్యాంగానికి విరుద్ధమని జీవో 9 ను తెలంగాణ హైకోర్టు కొట్టి వేయడం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసింది కనుక ఈనెల 14 న రాష్ట్రవ్యాప్త బందు కు బీసీ సంఘాలు పిలుపునివ్వడం జరిగింది. కావున ఇట్టి రాష్ట్ర బంద్ కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని విలేకరుల సమావేశంలో పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, వెల్దండ మండల మాజీ ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ ఎంపిటిసి హనుమంతు నాయక్, పోలే అశోక్,ఈదులపల్లి నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటీయు రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలి

**టేక్మాల్,అక్టోబర్ 12, మన సాక్షి:**



మెదక్ జిల్లాలో జరిగే సీఐటీయూ రాష్ట్ర5వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటీయు జిల్లా కోశాధికారి కే.నర్సమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం టేక్మాల్ మండలం పరదిలోని ఎల్లుపేట గ్రామంలో వేల్పుగొండ, కమ్మరికత్త, సూరం పల్లి, బోడగట్టు, షాబాద్, గ్రామపంచాయతీ కార్మికుల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ మెదక్ పట్టణంలో డిసెంబర్ 7,8,9 తేదీలలో రాష్ట్ర మహాసభలు జరుగుతయని తెలిపారు. ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభ మన మెదక్ జిల్లాలో జరగడం సంతోషమన్నారు. ఈ మహాసభలలో గత 3 సంవత్స కాలంలో కార్మిక వర్గం చేసిన పోరాటాలు చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను,రూపొందిస్తున్నారు. మెదక్ పట్టణంలో జరిగే మహాసభలకు కార్మికులు ప్రజానీకం అందరూ ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు మల్లేశం,సాయిలు ,రాములు,ఆంజనేయులు,మల్లయ్య ,రాజు తదితరులు పాల్గొన్నారు..

## బీసీలకు దక్కవలసిన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్రంలో బిసిల 42 శాతం రిజర్వేషన్ సాధించేంత వరకు అలు పెరుగని పోరాటం చేస్తామని ఆమనగల్లు బిసి ఐక్య వేదిక తెలిపింది. సంఘ టితంగా ముందుకు సాగి న్యాయంగా దక్కవలసిన హక్కులను సాధించు కుంటామని అన్నది. ఆదివారము ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మాస్టర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బీసీ ఐక్య వేదిక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బిసి సంఘం పిలుపు మేరకు అక్టోబర్ 14న నిర్వహించి తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయ వంతం నిర్వహణపై చర్చించించి పగడ్బందీగా బంద్ ను విజయ వంతం చేసేందుకు అన్ని బీసీ కులాల ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరింది. జనాభా ప్రాతి పదికన బీసీలకు దక్క వలసిన హక్కులను కాల రాస్తున్న ప్రభుత్వాలకు బీసీల ఐక్యతతో గుణపాఠం చెప్పే విధంగా ముందుకు సాగుతా మని తెలిపింది. నేడు సన్నాహక సమావేశం బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారము ప్రత్యేక సమావేశం నిర్వ హిస్తున్నట్లు బీసీ ఐక్య వేదిక తెలిపింది. పట్టణ కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించ నున్న సన్నాక సమావేశానికి అన్ని కులాల బిసి సంఘాలు హాజరు కావాలని కోరింది. బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారము నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బంద్ నిర్వహణపై సన్నాహక సమావేశంలో చర్చించ నున్నట్లు ఐక్య వేదిక తెలిపింది. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక ప్రతి నిధులు చుక్క అల్లాజి గౌడ్, తల్లోజు రామకృష్ణ,ఎంగలి బాలకృష్ణ, అవ్వారి శివలింగం, నిరంజన్ గౌడ్, కోట్ల వెంకటేష్,దుద్దు ఆంజనేయులు, గోల్డ్ రాము,నాగిళ్ల జగన్,గాజుల శ్రీను,పూసలి పరమేష్, దేవరకొండ రమేష్,లు ఉన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం

### అధికారుల పై చర్యలు తీసుకోవాలి

**నారాయణపేట టౌన్,అక్టోబర్.12, మన సాక్షి :**



సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అద్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో సమాచార హక్కు చట్టం -2005 , 20వ వార్షికోత్సవం సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు పంతిగి చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005 ,అక్టోబర్ 12న అమలు లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తి చేసుకు న్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వార్షికోత్సవాలు నిర్వహి స్తున్నమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అధికారికంగా నిర్వ హించాలని చెప్పినప్పటికీ వివిధ జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం చేస్తూ,ఆర్టీఐ గురించి అవగాహన కల్పించలేక పోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శ కత, జవాబుదారీతనం పెం పొందించకుండా, అవినీతిని నిర్మూలించకుండా పోయిందని విమర్శించారు. ఈ సమావే శంలో లీగల్ అడ్వైజర్ లక్ష్మీ నారాయణ, జిల్లా ఇంచార్జీ ఎడ్ల కుర్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా సభ్యులు గజలప్ప, జిల్లా సలహాదారు జిందప్ప, నారాయణపేట అసెంబ్లీ ఇంచార్జ్ గణేష్, సభ్యులు సంధ కృష్ణ, మాణిక్యాల రమేష్, మండల అధ్యక్షులు వెంకటయ్య, బ్రహ్మయ్య, మురళి, రాము,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు కొరకు కృషి చేస్తా

## - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల,అక్టోబర్ 12,మన సాక్షి:**



ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమల కొరకు కృషి చేస్తానని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో జగిత్యాలలో పి ఆర్ టి యు టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనందరావు యాల్ల అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కొరకు కృషి చేస్తానని వారన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కొరకు కృషి చేస్తానని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథి పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఉద్యోగ ఉపాధ్యాయులకు క్యాష్ లెస్ హెల్త్ స్కీము వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ టెట్ పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తుందని అదేవిధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ నెలవారీగా 700 కోట్లు ఆర్థిక శాఖ విడుదల చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వారన్నారు కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలికి పోటీ చేసిన అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమించాలని వారన్నారు ఈ కార్యక్రమంలో ఇటీవల పదోన్నతి పొందిన 153 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

# నగరంలో ఓట్ చోరి కార్యక్రమం.. సంతకాల సేకరణ

**ఖమ్మం జిల్లా,అక్టోబర్ 12,మన సాక్షి:**



ఎఐసిసి–పిసిసి పిలుపులో భాగంగా ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు టూ టౌన్ పరిధిలోని 50,51,52,58 డివిజన్ల నందు ఓట్ చోరి కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ జరిగింది..అనంతరం స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్ అధ్యక్షతన జరిగిన సభలో కాంగ్రెస్ రాష్ట్ర యుపజన నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ బాబు టూ టౌన్ ఇన్ చార్జ్ కాంగ్రెస్ జిల్లా నాయకులు శెట్టి రంగారావు మాట్లాడుతూ మన ఓట్లను చోరి చేసి దేశంలో బిజెపి పరిపాలన కొనసాగిస్తుందని వీటిని తిప్పి కొట్టే ప్రయత్నంలో భాగంగా మన మంత్రివర్యులు తుమ్మల పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో కెకెసి జిల్లా అధ్యక్షుడు సి హెచ్ విప్లవ్, ఆయా డివిజన్ల నాయకులు సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నల్లమల వేణు, వాంకుడోత్ బేబీ, కుంచెపు ఆశయ్య, నల్లమల సుధాకర్,గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, చెరుకూరి పాల్గొన్నారు వెంకట్ నాయుడు, కాసిన్ని శ్రీనివాసరావు, సోమా సత్యనారాయణ, సీతక్క, బాబు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**




గచ్చిబౌలి స్టేడియంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ గ్రేస్ , స్క్రీన్ ఫర్ లైఫ్ అనే థీమ్ తో నిర్వహించిన గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్( 10కే, 5కే, 2కే) ఎనిమిదో ఎడిషన్ ను ఎమ్మెల్యే గాంధీ,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్,మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు లు ముఖ్య అతిథిలుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ లక్షలాది మందిని కబళిస్తున్న కాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన సామాజిక బాధ్యత మనందరి పై ఉందన్నారు. ఆరోగ్య తెలంగాణ" ను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. సమాజంలో క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలియచేసారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్" 10కే, 5కే , 2కే రన్ నిర్వహించడం చాలా అభినందనియమని ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పై విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది అని , నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడం ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుంది అని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యము పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం ,ప్రశాంతత చేకూరుతుంది అని, మారిన జీవన శైలి లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని ,ఇది ఒక మంచి శుభపరిణామం తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. చినబాబు సుంకవల్లి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల స్పెషల్ డ్రైవ్ల తనిఖీలు



**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**

ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆదివారము స్థానిక ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ వాడటం వల్ల కలిగే లాభాల గురించి అవ గాహన కల్పిస్తూ మద్యం తాగి వాహనాలను నడూప వద్దని మైనర్లకు వాహనాలను ఎవరైనా ఇచ్చిన వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. ఈ తనిఖీలలో రక్షక భట సిబ్బంది ఉన్నారు.

# పేదలకు సిఎంఆర్ఎఫ్ వరం

**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటు నందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆదివారము రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో అందుగుల గ్రామానికి చెందిన చిత్తపురం రవీందర్ ఇటీవలే అనారోగ్యనికి గురి కావడం జరిగింది. రవీందర్ కి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 60,000 వేల రూపాయల సిఎంఅర్ఎఫ్ చెక్కును లబ్ది దారునికి అందించారు.ఈ కార్యక్రమలో వెల్దండా మండల మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, తలకొండ పల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దండ మండలం మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొజ్జయ్య,గణేష్, పాల్గొన్నారు.

# బిసిలపై కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ

**జగిత్యాల,అక్టోబర్ 12,మన సాక్షి:**



బిసిల పట్ల కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం వ్యవహారిస్తున్న కపట ప్రేమ హైకోర్టు తీర్పుతో బయటపడిందని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడతు కామారెడ్డి డిక్ల రేషన్ తో బిసి సమాజాన్ని అయోమయం కు గురి చేసిందన్నారు. బిసి కులాలను ఆశల పల్లకిలో నెట్టి, చెల్లని జీవోతో బిసి సమాజం తో చెలగాటం ఆడిందన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు నాయకులుగా ఎదిగే అవకాశం పోగొట్టిందని, కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనం కొరకే బిసిలను వాడుకుందని ఆరోపించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో బిసిల కోసం కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యం అని అన్నారు. గవర్నర్ దగ్గర, అటు రాష్ట్రపతి దగ్గర బిల్లు పెండింగ్ లో ఉండగా జీవో 9 తో ఎన్నికలకి ఎలా వెళ్తారానే సోయి అటు ప్రభుత్వం కు, ఇటు ప్రభుత్వ, పార్టీ పెద్దలకు, సలహాదారులకు లేకపోవడం విచారకరం అన్నారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఆనంద్ రావు మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్ బీఆర్ ఎస్ నాయకులు బందేల శేఖర్ మహేష్ గౌడ్ రాకేష్ వెంకటేష్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో

**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**



నిండు జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో వ్యాది నివారణకు రెండు చుక్కలు ఖచ్చితంగా వేయించాలని స్థానిక ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారము ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఏ మాట్లాడుతూ చిన్నారుల్లో పోలియో వ్యాధి నివారణకు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని తల్లి దండ్రులకు విజ్ఞప్తి చేస్తూ పోలియో పూర్తిగా నిర్మూలించబడిన దేశంగా రూపు దిద్దు కోవడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కోరుతు పిల్లల భవిష్యత్తుకు పోలియో చుక్కలు తప్పనిసరి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపకులు మెకానిక్ బాబా, సురేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, విజయ్ రాథోడ్, ఫరీద్,ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ అధికారిని మైమూన్, వైద్యాధికారి మంజులాదేవి, సిహెచ్ఓ విజయలక్ష్మి,హెచ్ఈఓ తిరుపతి రెడ్డి,డిపిఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, సూపర్వైజర్ నాగేశ్వరి, ఏఎన్ఎం మాధవి,ఆశ వర్కర్లు వైద్య సిబ్బంది,గుజ్జరి శ్రీనివాసులు, ఉన్నారు.

# జాతీయ పల్స్ పోలియో



**మేడ్చల్,అక్టోబర్ 12,మన సాక్షి:**

జాతీయ పల్స్ పోలియోను పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పాల్గొని చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలను అర్హులైన ప్రతి చిన్నారులకు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, ఏకలవ్య నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాధా, కావాలి శ్రీనివాస్, వాసు, నరహరి, అశోక్ పాల్గొన్నారు.

# అలయ్ బలయ ఆత్మీయ సమ్మేళనం

**మేడ్చల్,అక్టోబర్ 12,మన సాక్షి:**



మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బీసీలలో ఐక్యమత్యం పెంపొందించడానికి ఎంతో దోహద పడుతుందని వారన్నారు. బీసీలు రాజకీయ, విద్య, వ్యాపార రంగాల్లో రాణించాలని వారు తెలిపినారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు శాలువలు, మేమంటులతో సత్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఇడుగురాళ్ల సురేష్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల పరిసరాలు, బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలమల లక్ష్మణ్ గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షులు కొండ యాదగిరి గౌడ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్ గౌడ్, గజ్జల రాజు,బీసీటీఏ లక్ష్మీ నారాయణ, బండారి మల్లేశం, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు పాకాల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరే సత్తయ్య గౌడ్, రామ్ గోపాల్, చెవుల మల్లేశం, కృష్ణ, హరి, తుమ్మ రాజేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ


**ఆమనగల్లు,అక్టోబర్ 12,మన సాక్షి:**



కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి అనుబంధ విభాగంగా పని చేస్తుందని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసిసి ఇన్చార్జి చల్ల వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. బిజెపి ఓటు చోరీ కి అడ్డు కట్ట వేసేందుకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 5 కోట్ల మంది సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.మండల కేంద్రంలో ఆదివారము సాయంత్రం ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వంశీచంద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహతో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 15 వరకు వ్యతి రేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తిచేసి అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించ నున్నట్లు వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు.బిజెపి ఎన్నికల సంఘాన్ని అడ్డు పెట్టుకొని ఓటు చోరీ ద్వారా అధి పత్య రాజకీయాలు సాగిస్తుందని అన్నారు.ఓటు చోరీకి వ్యతి రేకంగా దేశంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామకం పారదర్శకంగా చేపడుతున్నట్లు చెప్పారు.ఈనెల చివరి వరకు డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తవు తుందని వెల్లడించారు.యువత బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీ మైనార్టీలు మహిళలకు డిసిసి అధ్యక్షుల నియామకంలో సమచిత స్థానం కల్పిస్తున్నట్లు వంశీ చంద్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో చేగురు వెంకటేశ్, రాములు, అంజయ్య, గుజ్జల మహేష్ యాదయ్య గౌడ్, లక్ష్మయ్య, బిక్షపతి,యాదగిరి రెడ్డి,జాంగిర్ అలీ,జాంగిర్ బాబా, షాబుద్దీన్, సత్యం,మల్లేష్ గౌడ్, రాము నాయక్,ఆనంద నాయక్, బాల్రాజ్, చెన్నయ్య,క్యామ శేఖర్, శంకర్, రామకృష్ణ,సిలారి, శ్రీశైలం,మల్లయ్య రాజేష్, జవహర్లాల్,తులసిరాం, నరసింహ,యాదయ్య చెన్నయ్య హరిపు ఫరీదో అనిల్ కుమార్ లకపతి, నాయక్ ఇమ్రాన్ బాబా, అస్గర్ అలీ,మల్లయ్య, బలరాం నాయక్,కృష్ణా నాయక్,లు పాల్గొన్నారు.

# పోలియోను నిర్మూలిద్దాం

## ఎమ్మెల్యే కాలె యాదయ్య




**శంకర్‌పల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**

పోలియోను నిర్మూలిద్దాం అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలో ఆదివారం వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల్లో పోలియో వ్యాధి నివారణకు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్, మెడికల్ ఆఫీసర్ డా. రేవతి రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# మణికొండలో అగ్నిప్రమాదం

**రాజేంద్రనగర్,అక్టోబర్ 12,మన సాక్షి:**



బీ.ఆర్.సి అపార్ట్మెంట్ ఎలక్ట్రికల్ వైర్స్ డక్ యూనిట్ లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.మంటలను చూసి కిందకు పరుగులు తీసిన అపార్ట్మెంట్ వాసులు. అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది.4 ఫయర్ ఇంజిన్ల సహాయం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలక్ట్రికల్ డక్ యూనిట్ లో వైర్లు పూర్తిగా కాలి పోవడంతో 19 ఫ్లోర్ల వరకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా. మంటలను చూసి కిందకు పరుగులు తీసే క్రమంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

# ఏసీ రిపేర్‌కు వెళ్లి యువకుడి మృతి

## సేఫ్టీ లేకనే ప్రమాదం

## కంపెనీపై బంధువుల ఆగ్రహం

**రాజేంద్రనగర్,అక్టోబర్ 12,మన సాక్షి:**

నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపూర్ సన్ షైన్ విహాన్ అపార్ట్‌మెంట్‌లో దారుణం జరిగింది. ఏసీ రిపేర్ కోసం రెండవ అంతస్తుకు వెళ్లిన ఓ యువకుడు కిందపడి దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగుల ఆరోపణల మేరకు, ఇది కేవలం ప్రమాదం కాదని, డైకిన్ ఏసీ కంపెనీ నిర్లక్ష్యం వల్లే జరిగిన హత్యతో సమానమని ఆరోపించారు.మృతుడు ఫారూక్ (25), గజ్వేల్‌కు చెందినవాడు. ప్రస్తుతం మెహదీ పట్నం లో నివాసం ఉంటున్న ఫారూక్, డైకిన్ కంపెనీ సర్వీసింగ్ సెంటర్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు.రిపేర్ కోసం అల్కాపూర్‌లోని విహాన్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన ఫారూక్, రెండవ అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మరణించాడు.ఘటనా స్థలానికి చేరుకున్న ఫారూక్ బంధువులు, తోటి ఉద్యోగులు కంపెనీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "డైకిన్ కంపెనీ తరపున ఫారూక్‌కు ఎలాంటి భద్రతా చర్యలు (సేఫ్టీ ప్రికాషన్స్) ఇవ్వలేదు. సరైన పరికరాలు, సేఫ్టీ బెల్ట్ లేకుండానే పనికి పంపడం వల్లే ఈ ఘోరం జరిగింది," అని బంధువులు ఆరోపించారు.ఇంటి యజమాని ఒత్తిడి చేయడం వలనే ఫారూక్ హడావుడిగా పని చేసే క్రమంలో కిందపడి చనిపోయాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.సేఫ్టీ లేకుండా ఏసీ టెక్నీషియన్లను పని చేయించడం వల్లే గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. డైకిన్ కంపెనీ సర్వీసెస్ తమ కార్మికులకు ఇన్సూరెన్స్‌లు కూడా ఇవ్వకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. నిర్లక్ష్యం వహించిన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి," అని తోటి ఉద్యోగులు డిమాండ్ చేశారు.నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కంపెనీ నిర్లక్ష్యం, ఇంటి యజమాని ఒత్తిడిపై విచారణ జరిపితేనే ఫారూక్ మృతికి గల అసలు కారణాలు తెలుస్తాయని స్థానికులు చెబుతున్నారు.



## బస్తీ దవాఖానలో పల్స్ పోలియో



**మేడ్చల్,అక్టోబర్ 12,మన సాక్షి:**

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ బస్తీ దవాఖాన లో పల్స్ పోలియో సందర్భంగా కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, బిక్ష పతి తదితరులు పాల్గొన్నారు.

## కేజేఆర్ కాలనీలో ఉచిత ఆరోగ్య శిబిరం



**దామరచర్ల,అక్టోబర్ 12,మన సాక్షి:**

కేజేఆర్ కాలనీ దిలావర్పూర్ గ్రామ పంచాయతీ నందు ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ నాణిక్య ఆధ్వర్యంలో అమూల్య హాస్పటల్ వారి సహకారంతో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది దాదాపు 150 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కావలసిన మందులు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ నాణిక్య అమూల్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ స్ఫూర్తి ఉమెన్ ఫౌండేషన్ చైర్మన్ పందిర్ల పద్మావతి రామ్మూర్తి గౌడ్ డాక్టర్ ఎస్ కే అన్వర్ డాక్టర్ పందిర్ల స్వాతి పెండం విజయ్ మాజీ ఎంపిటిసి వీర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**సూర్యాపేట రూరల్,అక్టోబర్ 12, మన సాక్షి:**

సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి ప్రభుత్వ పాఠశాలలో 1992-93 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాడు విద్య బోధించిన గురువులను సన్మానించుకున్నారు. అనంతరం ఒకొక్కరుగా మాట్లాడి పాఠశాల జ్ఞాపకాలు, ప్రస్తుత జీవన విధానాన్ని చెప్పుకొని ఆనందంగా గడిపారు. కష్టాల్లో ఉన్న మిత్రులను ఆదుకోవాలని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి సహకరించాలని నిర్ణయించుకున్నారు. ప్రధానోపాధ్యాయులు దేవరశెట్టి జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటి గురువులు రిటైర్డ్ హెడ్ మాస్టర్ వెంకట్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, లక్ష్మి, వీరబ్రహ్మేంద్రచారి, సంధ్య, దీపక్ రెడ్డి, మురళి, కిషన్ రావు, జమాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## దివానే మస్తాన్ వలీ ఖాద్రిదర్గాలో ఉరుసు

**రామసముద్రం,అక్టోబర్ 12,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని దిగువపేటలోని దివానే మస్తాన్ ఖాధరీవల్లీ దర్గాలో మంగళవారం 62వ గంధపు మహోత్సవం హిందూ, ముస్లిం సోదరులు ఐక్యమత్యముతో ఉరుసు నిర్వహిస్తున్నట్లు మంగళవారం సాయంత్రం 6గంటల నుండి 8గంటలవరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉరుసులో మంగళవారం రాత్రి జరగబోయే ఫాతేహా, గంధపు మహోత్సవం, అన్న దానం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి కర్ణాటక కు చెందిన ప్రముఖులు చే కవ్వాలి ఉంటుందని దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## చిత్తుబొత్తు అట స్తావరం పై పోలీసుల దాడి

### ముగ్గురి అరెస్టు, 3,29,500 నగదు స్వాధీనం

**తూప్రాన్, అక్టోబర్ 12,మన సాక్షి :**



చిత్తు బొత్తు అట ఆడుతున్న స్టావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి 3లక్షల 29వేల 500 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ సిఐ రంగా కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి వెల్దుర్తి మండలం పరిధిలోని దామరంచ అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు హెడ్స్ అండ్ టేల్స్(చిత్తు బొత్తు) అనే జూద ఆట ఆడుతున్నారని తెలిసిన సమాచారం మేరకు.వెల్దుర్తి ఎస్ఐ సిబ్బందితో కలిసి ప్రత్యేక దాడి నిర్వహించారు. దాడి సమయంలో, అక్కడ జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుబడగా సుమారు మరో పది మందికి పైగా వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు.దాడి సమయంలో సంఘటన స్థలంలో జూదంలో ఉపయోగించిన 5 మోటార్ సైకిళ్లు, 8 మొబైల్ ఫోన్లు మరియు రూ.3,29,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆటలో గల ప్రధాన వ్యక్తులు పరారీలో ఉన్నవారి వివరాలను సేకరించడానికి దర్యాప్తు జరుపుతున్నామని సిఐ తెలిపారు. జూదం ఆడటం వలన గ్రామీణ ప్రాంతాల్లో చట్టం మరియు శాంతి భద్రతలకు భంగం కలగవచ్చని, ఇటువంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. ప్రజల సహకారంతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు.

## రాష్ట్రీయ స్వయంసేవక సంఘ శతాబ్ది ఉత్సవాలు





**నారాయణపేట టౌన్, అక్టోబర్ 12, మన సాక్షి :**

నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక సంఘ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ కార్యక్రమాన్ని జాజాపూర్ గ్రామ రైస్ మిల్లు నుండి గ్రామ పురవీధుల గుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకున్నారు. ముందుగా ప్రార్థన తో పథ సంచలన్ ప్రారంభించారు. పథ సంచలన్ పాల్గొన్న స్వయం సేవకులకు అడుగడుగునా ప్రజలు, మహిళలు పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హిందూ వాహిని తెలంగాణ రాష్ట్ర మంత్రి యాదిరెడ్డి బిజ్వర్ గురూజీ శక్తి పరా శ్రీ లు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి గ్రామ గ్రామానికి ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉంటూ దేశానికి సేవ చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశ రక్షణకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ధర్మం కోసం యువత పనిచేస్తూ దేశం కోసం పనిచేసే దేశభక్తులందరినీ ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తుందన్నారు. దేశ సంఘటితం కోసం స్థాపించిన ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఈ దేశం కోసం పనిచేస్తుందని అన్నారు. హిందువులో సంగటితశక్తి నెలకొంటుందని స్వయంసేవకుల నిత్య పోరాటాలు మరువలేనివని కొనియాడారు. దేశ రక్షణ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సాధ్యమని ఆర్ ఎస్ ఎస్ ఏ మతానికి ఏ వర్గానికి వ్యతిరేకం కాదని ఈ దేశం కోసం పనిచేస్తుందని స్పష్టంచేశారు. 1925 వ సంవత్సరంలో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని అన్నారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్కూరు మండల కండ శాఖ స్వయం సేవకులు పాల్గొన్నారు.

## బీసీలకు రిజర్వేషన్ల నిలుపుదల పై నల్లబ్యాడ్జీలతో నిరసన

**మిర్యాలగూడ, అక్టోబర్ 12, మన సాక్షి:**



బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ లను నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ లు మాట్లాడుతూ బీసీల కు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు నిలుపదల చేయడం దుదృష్టకరం అన్నారు..రాజ్యాంగపరంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించే వరకు జేఏసీ ఆధ్వర్యం లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిరుమలగిరి అశోక్,కోలా సైదులు ముదిరాజ్,మురళి యాదవ్, దాసరాజు జయరాజ్ ,నల్లగంతుల నాగభూషణం ,గుడిపాటి కోటయ్య, నాయుడు భాస్కర్ ,నేతి సత్య నారాయణ, ముఖ్యరంజి బాబు, తోట వెంకటేశ్వర్లు,మల్లో సైదాచారి, ఈశ్వర చారి ,క్రాంతి,శ్రీనివాస్, తన్నీరు పాండురంగయ్య,ఓగుల సైదులు గౌడ్,పసుల కాశయాదవ్, లక్ష్మీనారాయణ,రాంబాబు, పానుగంటి హరి,కిషన్,ఉపేందర్, వెంకటేశ్వర్లు,పగిలి సైదయ్య, గంగుల బిక్షం,సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా వెంకన్న మాస కళ్యాణ మహోత్సవం

**మేడ్చల్,అక్టోబర్ 12,మన సాక్షి:**



కనుల పండుగగా వెంకన్న మాస కళ్యాణ మహోత్సవం. ఆనంద్ బాగ్ చౌరస్తాలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని మాస కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణ చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణ చార్యులు వేద మంత్రోచ్చరణలతో అంగరంగ వైభవంగా స్వామి వారి వివాహ క్రతువును నిర్వహించారు. భక్తులు పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాస కళ్యాణ మహోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు అని ఆలయ ఈఓ ఏబి రవీందర్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో ఖమ్మంకు నూతన శోభ

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం జిల్లా,అక్టోబర్ 12,మన సాక్షి:**



కొత్తగా నిర్మించనున్న తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు కావలసిన స్థలాల సేకరణ కోసం ఆదివారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. దేవాలయంకు సరిపడ అనువైన భూమి కోసం అధికారులతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం, అల్లీపురం లోని ప్రభుత్వ భూములు, అత్యంత ప్రాధాన్యత కలిగిన స్థలాల సేకరణ సాధ్యాసాధ్యాలపై మ్యాప్ లను పరిశీలన చేసి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణం కోసం పలు స్థలాల ప్రతిపాదనలు పరిశీలించామన్నారు. టీటీడీ దేవస్థానం ప్రాశస్త్య ప్రమాణాలకు అనుగుణంగా రహదారి సామీప్యత, ఆలయంతో పాటు ఎక్కువ సంఖ్యలో వసతి గృహాల ఏర్పాటు అనుకూలత ఆధారంగా రెండు, మూడు స్థలాలకు ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. టీటీడీ అధికారులు, స్తపతి, పండితులు ఖమ్మం నగరానికి వచ్చి ప్రతిపాదిత స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆలయంకు అనువైన భూమిని ఖరారు చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో ఖమ్మం అర్డీవో నరసింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుమిత్ర భాయ్ ఆశయాలను సాధించాలి

**మిర్యాలగూడ, అక్టోబర్ 12, మన సాక్షి:**



సుమిత్ర భాయ్ ఆశయాలను సాధించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్,ఎండి అబ్బాస్ డీజే నరసింహారావులు అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్ గార్డెన్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్ర భాయ్ సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమిత్ర మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళ్ళు అర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాసం, కందాల ప్రమీల, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్ వినోద్ నాయక్,శశిధర్ రెడ్డి, పరుశు రాములు, అయూబ్ వరలక్ష్మి, రాగిరెడ్డి మంగారెడ్డి, సూర్యాపేట జిల్లా సిపిఎం నాయకులు పారేపల్లి మోహన్ రావు, వెంకట్ రెడ్డి, అనంత ప్రకాష్ అరుణ, గోవర్ధన, ఊర్మిళ, టిడిపి రాష్ట్ర నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఏం సీపీఐయు నాయకులు కాశి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దైద సత్యం తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా ఎంపికైన శ్రీకాంత్ కు ఘన సన్మానం



**గుర్రంపోడు, అక్టోబర్ 12,మన సాక్షి:**

గుర్రంపోడు మండలం జిన్నాయి చింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో డి.ఎస్.పి గా ఎంపికైన సందర్భంగా ఆదివారం శ్రీకాంత్ చదువుకున్న గుర్రంపోడు మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాల యాజమాన్యం 2004-05 పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నవోదయ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీకాంత్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,శ్రీకాంత్ చిన్నప్పటినుండి ఎంతో పట్టుదలతో శ్రమించి డీఎస్పీగా ఎంపిక కావడం తమ పాఠశాలకు ఎంతో గర్వ కారణమని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, తాను సాధించిన ఈ గొప్ప విజయం వెనుక తన యొక్క ఉపాధ్యాయుల కృషి అమూల్యమైనదని తెలియజేశారు. తన విజయం తన అమ్మమ్మ కాశమ్మకు అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,ఉపాధ్యాయులు వద్దిరెడ్డి నరసింహారెడ్డి,రావుల వెంకటనారాయణ గౌడ్,పన్నాల గోపాల్,సత్యం,జహంగీర్, శ్రీనివాస్, స్వప్న,నేహా,చంద్రమోహన్,పూర్వ విద్యార్థులు నారాయణ, రొండి ఏడుకొండలు,రవి,శ్రీధర్, కొండలు, శివ,వెంకటేష్,శ్రీనివాస్, ప్రకాష్, చంద్రకళ,హసీనా,హేమలత తదితరులు పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్రం కుట్ర

**బనకచర్లకు సహకరించాలని కేంద్రం లేఖ పట్ల ఖండన**

**తెలంగాణ బిజెపి ఎంపీలు, మంత్రులు రాజీనామా చేయాలి**

**బీసీ బిల్లు అమలుకు జరిగే పోరాటానికి సిపిఎం మద్దతు**

**విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



**మిర్యాలగూడ,అక్టోబర్ 12, మన సాక్షి:**

రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి రాజకీయంగా మోడీ ప్రభుత్వం లబ్ధి పొందాలని చూస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బృందావన్ గార్డెన్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్ర భాయ్ సంతాప సభలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎండి అబ్బాస్ సీనియర్ నాయకులు డీజే నర్సింగరావుతో విలేకరులతో మాట్లాడారు.బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి, బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, బిల్లు, జీవో రద్దుకు ప్రయత్నించిందని ధ్వజమెత్తారు.

తెలంగాణలో ఉన్న ఆరుగురు బిజెపి ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఇక్కడ బీసీ అనుకూలంగానే మాట్లాడుతూనే కేంద్రంలో వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. బీసీ బిల్లు అమలు కాకుండా కేంద్రం అడ్డుపడుతుందని దానికి నైతిక బాధ్యత వహించి 6 గురు మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, దీనికోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో చేసే న్యాయ పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని తెలిపారు.బీసీ బిల్లును అడ్డుకుంటున్న బిజెపికి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని క్షేత్రస్థాయిలో బిజెపి నాయకులను ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాలో కూలీ మహిళా పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హనుమకొండలో నకిలీ రైతులు భూమి లేకుండా ధాన్యం అమ్ముకపోయిన ప్రభుత్వ సొమ్ము కోటి 86 లక్షలు కాజేశారని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని వాటిలో ఏ ఒక్కటి సక్రమంగా అమలు కావటం లేదని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పట్టుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల, సయ్యద్ హాసం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు, రవి నాయక్, వినోద్ నాయక్ శశిధర్ రెడ్డి పరుశు రాములు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భవనాసి వారి వివాహ కళ్యాణ మహోత్సవం

### హాజరైన చమర్తి జగన్మోహన్ రాజు

**రామసముద్రం,అక్టోబర్ 12,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా సిద్ధవటం మండలం తెలుగు యువత నాయకులు పవన్ కుమార్ ఆహ్వానం మేరకు ఆదివారం వారి స్వగృహం నందు జరుగుతున్న పసుపు పచ్చని పెళ్లి పందిరిలో నూతన జంట మూడు ముళ్ళ బంధంతో ఒకటవుతున్న భవనాసి వారి సరస్వతి (వైశాలి) వరుడు వంశీ నాయక్ వివాహ కల్యాణ మహోత్సవమునకు హాజరై వారిరువుని పసుపుపచ్చని అక్షింతలు వేసి ఆశీర్వదించి దీవించిన రాజంపేట అసెంబ్లీ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఈ కార్యక్రమంలో సిద్ధవటం టిడిపి అధ్యక్షుడు శనివారపు మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్, దశరథ నాయుడు, సిద్ధవటం యువ నాయకులు రాజనాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగ ముని రెడ్డి, ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, భాకరాపేట సర్పంచ్ ప్రతాప్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, చెంచయ్య నాయుడు,కుప్పాల వెంకట సుబ్బయ్య, మురళి నాయుడు, అయ్యప్ప నాయుడు,నాగభూషణం నాయుడు,పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో

**కంగ్టి,ఆగస్టు 12,మన సాక్షి :**



పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని మాజీ జడ్పిటిసి కోట లలిత ఆంజనేయులు అన్నారు.ఈ సందర్భంగా ఆదివారం కంగ్టి మండల తడ్కల్ ఆరోగ్య సబ్ సెంటర్, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ .. ప్రతి ఒక్కరూ 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని కోరారు. కంగ్టి పీహెచ్సీలో పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ నాగమణి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం 50 బూత్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. సోమవారం, మంగళవారం, ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తప్పనిసరిగా 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, అనిత, అంగన్వాడి టీచర్లు విఠబాయి, సువర్ణ, ప్రేమల, ఆశ వర్కర్లు సావిత్రి, నిర్మల, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## భారతమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం

**సంస్థాన్ నారాయణపురం ,అక్టోబర్ 12, మన సాక్షి:**



సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఏనుగు భారతమ్మ వారం రోజుల క్రితం మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల కృష్ణారెడ్డి వారి మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి పార్థిస్తూ వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ మండల నాయకుల ద్వారా పరామర్శించి..వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 10/- వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాసమల్ల యాదయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సిలువేరు నర్సింహ, సీనియర్ నాయకులు చెక్క నరసింహ బైకని నరేందర్ యాదవ్, మినుగు గోపాల్,చింతల లింగస్వామి, ఏనుగు శ్రీను,ఏనుగు మోహన్, ఏనుగు లాలు,బోయ దుర్గయ్య పాల్గొన్నారు.

## పాపిరెడ్డి కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



శేరిలింగంపల్లిలోని పాపిరెడ్డి కాలనీలో గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్, శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకుడు మారబోయిన రవి యాదవ్ ఆదివారం మన బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, డ్రైనేజీ సరిగ్గా లేకపోవడంతో ప్రజల నివాసాల్లోకి మురుగు నీరు చేరుతుందని, రహదారులు సరిగ్గా లేవని, వీధి దీపాల సమస్య ఉందని అన్నారు.బ్లాక్ నం.6 లో చెత్త తీసుకెళ్లకపోవడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత శాఖలకు చెందిన అధికారులపై ఒత్తిడి తెచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, సోమనాథ్, గంగాధర్ గౌడ్, శంకర్, సాయి నందన్ ముదిరాజ్, పవన్, వడ్డె శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, బాలరాజు, శ్రీశైలం యాదవ్, కె రాజు చారి, మున్నా, వెంకట్, నరసింహ, పద్మ, అనిత,నాగమణి కాలనీవాసులు పాల్గొన్నారు.

## ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

### ఎమ్మెల్యే వేముల వీరేశం



**కేతేపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**

రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నకరికల్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు కేతపల్లి మండలంలోని కొత్తపేట, కాసనకోడు, గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపహాడ్ గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తెచ్చిన ప్రతి గింజను త్వరగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారని తెలిపారు. మిగతా రాష్ట్రాల తో పోల్చుకుంటే మన రాష్ట్రంలో 12 ధాన్యం మొత్తం కొనుగోలు చేసేది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకటేనని ఆయన అన్నారు. రైతులు దళారీల బారిన పడకుండా తమ ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన దాన్య విక్రయ కేంద్రాలలో అమ్ముకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసీఎంఎస్ చైర్మన్ బోల్ల వెంకటరెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంపల్సరి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపిటిసి సుందర్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వల్లాల అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**శాలిగౌరారం,అక్టోబర్ 12,మన సాక్షి:**



1948 సంవత్సరంలో రజాకార్ల కాల్పుల్లో అసువులు బాసిన పదిమంది అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు అన్నారు. 1948 సంవత్సరంలో నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జాతీయ జెండాను ఎగరవేశారనే నెపంతో పదిమంది విద్యార్థులను రజాకార్లు కాల్చి చంపారు. వల్లాల అమరవీరుల చరిత్రను తెలుసుకున్న వి.హనుమంతరావు ఆయన సొంత ఖర్చులతో అమరవీరుల స్మారకార్థం స్థూపాన్ని నిర్మించి గత నెలలో స్థూప ఆవిష్కరణ సభ నిర్వహించిన విషయం విధితమే. ఆ సభ సందర్భంగా మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ జానారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పదిమంది అమరవీరుల కుటుంబాలకు తల 50 వేల రూపాయల చొప్పున పంపించిన లక్షల రూపాయలను ఆదివారం వల్లాల గ్రామంలో అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ భవిష్యత్తులో అమరవీరుల కుటుంబాలకు అన్ని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. వల్లాల అమరవీరుల గుర్తుకు చిహ్నంగా అత్యున్నతమైన సదుపాయాలతో గవర్నమెంట్ పాఠశాలను మంజూరు చేయించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ శాసనసభ్యులు గోనె ప్రకాశరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సామా అభిషేక్ రెడ్డి, మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,వల్లాల మాజీ సర్పంచులు ఎస్ కె ఇంతియాజ్, భూపతి వెంకన్న, దండ అశోక్ రెడ్డి, నరిగే నర్సింహా, మాధగోని రామలింగయ్య, నోముల జనార్ధన్, గుండ్లపల్లి సైదులు, వేముల గోపీనాథ్,బోడ అరుణ్ కుమార్, నోముల రవి, గుండ్లపల్లి శంకర్, గుండ్ల పల్లి నాగరాజు, కుర్ర లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## లౌకిక,ప్రజాస్వామిక రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

**సూర్యాపేట,అక్టోబర్ 12,మన సాక్షి:**




దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్ పైనే ఓ మతోన్మాది న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం భవనంలో ముఖ్య నాయకుల సమావేశం లో పాల్గొని మాట్లాడుతూ సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తి పై బూటు విసిరివేసే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు తాను అనుకూలంగా వ్యవహరించాలని బెదిరింపు ధోరణి అరాచకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇది కేవలం న్యాయవాది చేసిన చేసిన దాడిగానే చూడవద్దని గత కొన్నేళ్లుగా దేశంలో మతం, మితవాదం శక్తుల అధిపత్య వైఖరి చివరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి కి దారి తీయడం ప్రజాస్వామ్య విలువను పతనానికి పరాకాష్టమని అన్నారు. రాజ్యాంగాన్ని నిలబెట్టటానికి సామాజిక అడ్డంకులను బద్దలు కొట్టిన వ్యక్తిని బెదిరించటానికి, అవమానించటానికి జరిగిన ప్రయత్నమే ఈ దాడి యత్నం సంఘటన ప్రతిబింబిస్తుందని అన్నారు. గత శతాబ్దంలో దేశంలో మతోన్మాదం, మతతత్వం మన సమాజాన్ని ఎలా ముంచేత్తేస్తున్న అనేది ఇలాంటి బుద్ధిహీనమైన చర్య చూపిస్తుందని గన్న చంద్రశేఖర్ వెల్లడించారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున మేము ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని మన న్యాయ వ్యవస్థకు సురక్షితం భద్రత ప్రధానమైనది ఆయన అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండల వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్స్ డే..బిషప్ దంపతులకు ఘన సన్మానం



**కేతేపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**

పాస్టర్స్ డే సందర్భంగా బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ – హెప్సిబా లకు కేతేపల్లి మండలంలోని కొర్లపాడు గ్రామంలో ఆదివారం వివిధ గ్రామాల పాస్టర్లు, ఆయా సంఘాల క్రైస్తవులు శాలువాలు కప్పి, పూలమాలల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండవ ఆదివారం రోజున పాస్టర్స్ అప్రిసియేషన్ డే గా జరుపుకుంటారని తెలిపారు. ప్రపంచంలోని ప్రతి దైవజనులందరికి పాస్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు దేవుని సువార్త పరిచర్య ప్రారంభించి నిందలు అవమానాలు భరించి ఆకలి దుఃఖము ముఖములో కనబడకుండా నిత్యము దేవుని రాజ్య సువార్త ను ప్రకటించే పాస్టర్లు ఉన్నారని పేర్కొన్నారు నిత్య జీవములోనికి అనేకమందిని నడుపుతూ సంగాలు గ్రామాల కోసం, మన కుటుంబం రాష్టం, దేశం, ప్రజలందరి రక్షణ కొరకు నిత్యము ప్రార్ధిస్తూ ఆధ్యాత్మికంగా, ఆత్మీయంగా బలపరిచిన ఆత్మీయ తల్లి దండ్రులను సన్మానించడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిషప్ తో పాటు ఆయా గ్రామాల చెందిన పాస్టర్లు మొలుగురు రూబెన్, కమలమ్మ, కొండేటి లాజర్, ఇస్తేరమ్మ, కొమ్ము హెూసన్నా, బాణాల సైమన్ లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో యడవెల్లి యేసుపాదం,సురేష్, మిర్యాల కళింగ రెడ్డి, పేతురు, బాబు, కిరణ్, సుధాకర్, భాస్కర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేసిన కాసేపటికే 3 నెలల కుమారుడు మృతి

**కంగ్టి, ఆగస్టు 12, మన సాక్షి :**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని భీమ్రాలో విషాదం చోటుచేసుకుంది. పల్స్ పోలియో చుక్కలు వేసిన కాసేపటికే తమ 3 నెలల కుమారుడు మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఉమాకాంత్ – స్వర్ణలత ఆరోపిస్తున్నారు. పోలియో చుక్కలు వేశాక ఇంటికి వచ్చామని, బాలుడు వాంతులు చేసుకున్నాడని తెలిపారు. పాలు తాగకుండా ఏడుస్తూనే ఉన్నాడని, సిబ్బందిని అడిగితే అందరికి వేసిన చుక్కలే ఈ బాలుడికి వేశామని చెప్పారని అన్నారు. ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టిస్తోంది.ఈ విషయమై పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ నాగమణిని " మన సాక్షి " వివరణ కోరగా మృతి చెందిన శిశుకు వేసిన పోలియో చుక్కల వాయిల్ నుంచి మరో 17మంది చిన్నారులకు సైతం వేశామన్నారు. మిగతా వారికి ఎలాంటి హాని జరగలేదన్నారు. శిశువు అనారోగ్య కారణాలతో మృతి చెందిందా ? లేక పోలియో చుక్కలు వికటించి మృతి చెందిందా అనే విషయం పోస్టుమార్టం నివేదిక ద్వారా వెల్లడవుతుందని ఆమె అన్నారు. ఈ విషయమై తండ్రి ఉమాకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శిశువును పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ దుర్గా రెడ్డి తెలిపారు. బాబు మృతి చెందడంతో దంపతులు బాధతో కుప్పకూలిపోయారు. ఈ ఘటనతో భీమ్రా గ్రామం శోకసంద్రంలో మునిగిపోయారు.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి దామోదర్ రెడ్డి సేవలు మరువలేనివి..!

♦ వారి కుటుంబానికి అండగా ఉంటాం

♦ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**సూర్యాపేట,అక్టోబర్ 12,మన సాక్షి:**

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికిస్వర్గీయ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన కృషి మరవలేనిదని ఆయన ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు దామోదర్ రెడ్డి దశ దిన కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిచారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ఫేస్– 2 కు రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్ట్ గా నామకరణం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.ఆదివారం అయన సూర్యాపేట జిల్లా ,తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో దివంగత మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు హాజరై దివంగత నేతకు ఘనంగా నివాళు లర్పించారు. రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దివంగత రామిరెడ్డి దామోదర్ రెడ్డి శాసనసభ్యులుగా,మంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలు, త్యాగాలు మర్చిపోలేనివని అన్నారు. ఎస్సారెస్పీ జలాలను ఉమ్మడి నల్గొండ జిల్లాకు తీసుకువచ్చి ఫ్లోరైడ్ భూతాన్ని తరమడంలో దామోదర్ రెడ్డి చేసిన కృషిని దృష్టిలో ఉంచుకొని ఎస్సారెస్పీ పేస్ –2 ప్రాజెక్టుకు రాం రెడ్డి దామోదర్ రెడ్డి (ఆర్ డి ఆర్ ఎస్ ఆర్ ఎస్ పి ) 2 గా నామకరణం చేస్తామని ఇదే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవోను ఇస్తామని చెప్పారు . అంతేకాక ఎస్ ఆర్ ఎస్ పి లో పూడికతీత ,కాలువల లైనింగ్ పనులను చేపడతామన్నారు .రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ,రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ,రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి ,పలువురు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, తదితరులు మాట్లాడారు. మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్,తుంగతుర్తి ఎం ఎల్ ఏ మందుల సామేల్,ఎం ఎల్ సి అద్దంకి దయాకర్,కొత్తగూడెం ఎం ఎల్ ఏ కూనమనేని సాంబశివరావు, ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం, సత్తుపల్లి ఎం ఎల్ ఏ రాగమయి,

తదితరులు మాట్లాడారు.డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్,కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి,టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యేసు దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



**రామసముద్రం, అక్టోబర్ 12, మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా యేసు ప్రభు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని,ప్రజలు సుఖసంతో షాలతో తులతుగాలని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆకాంక్షించారు. ఆదివారం మదనపల్లె నియోజక వర్గం రామసముద్రం మండలం చెంబకూరు సియోన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వహకులు, క్రిస్టియన్ మత పెద్దలు, స్థానిక వైసిపి నాయకులు నిస్సార్ అహమ్మద్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. అనంతరం చర్చ ఫాదర్ జాన్ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం నిస్సార్ అహమ్మద్ మీడియాతో మాట్లాడుతూ యేసు ప్రభువు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని, సర్వమత సామరస్యం యేసు క్రీస్తు ఆకాంక్ష అని, ప్రజలకు మంచి జరగాలని, కులం ఏదైనా మతం ఏదైనా మనుషులంతా ఒక్కటే అనే భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే మనిషి జన్మకు సార్థకం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిస్సార్ అహమ్మద్ తోపాటు ఫాస్టర్ జాన్, పాల్ చంద్రశేఖర్, రిచర్డ్, రాజేష్, రఘునాథరెడ్డి, జి. కె.చంద్ర, తిప్పరాజు,రవి,షంషీర్, షఫీ, ఎల్ఐసి శ్రీనివాసులు, విజయ్ రాజు, బషీర్, జింకల శ్రీనివాసులు, రాజన్న, ఈశ్వర్ రెడ్డి, నూర్ మొహిద్దీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర సంఘం అధ్యక్షునిగా జివిలికపల్లి రాములు



**తుర్కపల్లి, అక్టోబర్,12 మన సాక్షి:**

తుర్కపల్లి మండల కేంద్రంలో కుమ్మర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరుప్పల మల్లేశం ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ జివిలికపల్లి ఆంజనేయులు ,మండల ప్రధాన కార్యదర్శి నాగయ పల్లి శివరాములు, కోశాధికారి జాగిలాపురం సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి కొలనుపాక కొండల్ ,మీడియా కోఆర్డినేటర్ జివిలికపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. తుర్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జివిలికపల్లి రాములు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జివిలికపల్లి బాలరాజు, గంగాదరి నర్సింహులు , ప్రధాన కార్యదర్శిగా జివిలికపల్లి భాస్కర్, సహాయ కార్యదర్శిగా జీవిలికపల్లి గోపాల్, ప్రచార కార్యదర్శిగా జీవిలికపల్లి, రాజు, కోశాధికారిగా జివిలికపల్లి మహేష్, గౌరవ అధ్యక్షులు జివిలికపల్లి శ్రీనివాస్ ,బాల నరసయ్య, గంగాధరి నరసింహులు , గౌరవ సలహాదారులు జివిలికపల్లి సత్తయ్య, జివిలికపల్లి బాల నర్సయ్య ,జివిలికపల్లి రాములు, జివిలికపల్లి నర్సింలు, కార్యవర్గ సభ్యులు జివిలికపల్లి నాగరాజు, శ్రవణ్, వినయ్ ,చంద్రకాంత్, శివ, మణికంఠ, రాము ,తదితరులు పాల్గొన్నారు...

## యువకుల ప్రాణాలు తీసిన ఈత సరదా..!

- ఇద్దరు యువకులు గల్లంతు.. మృతదేహాలు వెలికితీత

**రాజేంద్రనగర్ అక్టోబర్ 12,మన సాక్షి:**



సరదాగా గడుపుదామని వచ్చిన ఇద్దరి యువకుల ప్రాణాలను ఈత సరదా తీసింది. ఈ ఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ వివరాల ప్రకారం...ఆదివారం సెలవు కావడంతో హసన్ నగర్ కు చెందిన సోహన్ (16). రేహాన్ (15)లతో పాటు నలుగురు స్నేహితులతో కలిసి బుద్వేల్ జన చైతన్య కాలనీ సమీపంలోని ఈసీ నది మొండి కత్వా వద్దకు వచ్చారు. సరదాగా ఈత కొట్టేందుకు సోహన్, రేహాన్ లు నదిలోకి దిగారు. ఐతే ఈత రాక పోవడంతో నీటిలో మునిగి మృతి చెందారు. తోటి స్నేహితులు భయంతో పారి పోగా గమనించిన స్థానికులు 100 నెంబరు డయల్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు మృతదేహాలను వెలికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం.



**బీర్కూర్ (మన సాక్షి) అక్టోబర్12.**

వర్ని మండలం పాత వర్ని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బీర్కూర్ మొగులయ్య గారి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి విచ్చేసిన వర్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కులకర్ణి సురేష్ బాబా గారు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేస్తూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని అన్నారు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు ఏనుగు రవీందర్ రెడ్డి గార్ల వర్గాల కార్యకర్తలు నాయకులు రాబోయే స్థానిక ఎన్నికలలో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధి కోసం అందరూ పాటుపడాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్ని మండలం సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు బీర్కూర్ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తులకు కేటాయించిన వైన్సులు వారికే దక్కాలి

**అడవిదేవులపల్లి,అక్టోబర్ 12,మన సాక్షి:**



అడవిదేవులపల్లి మండలంలో గౌడ కులస్తులకు రిజర్వేషన్ అయిన వైన్స్ షాపులను గౌడ కులస్తులే లక్కీ డ్రాలో పాల్గొనాలని గాదగోని మహేష్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా జాతి అభివృద్ధి ముందుచూపు ఆలోచనతో గౌడ ప్రజలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని రాష్ట్రంలో పలుచోట్ల రిజర్వుడు చేసిన వైన్స్ లు అక్రమాలకు గురవుతున్నాయి. దళారీ వ్యవస్థ,పెట్టుబడిదారీ వ్యవస్థ గౌడ కులస్తులకు ఆశ చూపి రిజర్వుడు అయిన గౌడ వైన్స్ లు వేరే వ్యక్తులు నడుపుచున్నారు.ఆ విధంగా బినామీగా ఉండొద్దని అలా ఉన్న వైన్సులు రద్దు చేయించి చట్టపరంగా మళ్లీ లక్కీ డ్రా తీయిస్తామని గాదగోని మహేష్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్ గౌడ్,తిరుపతయ్య గౌడ్, గాలి వెంకటేశ్వర్లు గౌడ్, ముత్యాలు గౌడ్,మట్టయ్య గౌడ్, రాంబాబు గౌడ్, కనకయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దగ్గుమందుపై తమిళనాడు సర్కార్ నిర్లక్ష్యం

తగు చర్యలు తీసుకోక పోవడంతోనే సిరప్ మరణాలు కేంద్ర ప్రభుత్వవర్గాల గుర్తింపు

న్యూఢిల్లీ: రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోక పోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి. దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ ÷–లగైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించినట్లు సమాచారం. ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి. ఆ ఫార్మా సంస్థలో ఏ ప్రభుత్వ ఏజెన్సీ ఆడిట్ నిర్వహించ లేదని తెలుస్తోంది. అలాగే ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్‌లో రిజిస్టర్ కాలేదని గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికేట్ లేకుండానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతివ్వడాన్ని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది.

విచారణలో భాగంగా కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు సహకరించడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించింది. కాగా, డ్రగ్స్ తయారీ యూనిట్లను తనిఖీ చేయడంలో కేంద్రం విఫలమైందని ఇప్పటికే తమిళనాడు విమర్శించింది. ఈ అంశంపై తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ.. మరింత హాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని చెప్పారు. ఇక, కంపెనీ యజమానిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## చిన్నారులకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

**నల్లగొండ, అక్టోబర్ 12,మన సాక్షి:**




నల్లగొండ పట్టణంలో చిన్నారులకు కార్పొరేట్ స్థాయి వైద్యం, అత్యాధునిక సదుపాయాలతో అందించడమే మా నెస్ట్ న్యూ బ్రాన్ చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మా లక్ష్యమని డాక్టర్ నితీష్, డాక్టర్ స్నేహ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నెస్ట్ న్యూ బ్రాన్ చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఆదివారం అనురాగ్ చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ హాస్పిటల్లో నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బందితో చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ స్థాయి చిన్నపిల్లల హాస్పిటల్ ను నల్లగొండలో ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు రక్త సేకరణ, స్కానింగ్, ఆక్సిజన్, బరువు పెంచడం వంటి అత్యాధునిక పరికరాలతో వైద్యం అందించి చిన్నారుల కు ప్రాణ రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నల్లగొండ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఐఎంఏ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. పుల్లారావు మాట్లాడుతూ విదేశాల్లో వైద్యం అందించి హైదరాబాదులో ఉండకుండా నల్లగొండలో స్థిరపడి ఇక్కడే హాస్పిటల్ నిర్మించి పిల్లలకు వైద్య సేవలు అందించడం గర్వకారణం అన్నారు. వీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. నూతన టెక్నాలజీ తో నిర్మించిన ఈ హాస్పిటల్ లో అత్యవసర, సేవలు అందించనున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ అనిత రాణి, డాక్టర్లు రమేష్, సుబ్బారావు, నితీష్, విశ్వ జ్యోతి, రాఘవేంద్ర రెడ్డి, కీర్తి, రవికుమార్, వీరారెడ్డి, ఐఎంఏ నీలగిరి డాక్టర్లు, పేరా మెడికల్ సిబ్బంది, శశి ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్ఐ కృష్ణయ్య

**మాడుగులపల్లి,అక్టోబర్ 12, మన సాక్షి:**



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం తె ల్ల వా ర ు జా వ ు ు న మండలంలోని కల్వలపాలెం వాగు నుండి ఉప్పనూతల నాగరాజు, చిట్యాల ప్రవీణ్, సురేష్ లు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా..నమ్మదగిన సమాచారం మేరకు మూడు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్ కు తరలించి ట్రాక్టర్ యజమానుల పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.